నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 30 ఆగస్టు 2024 | NIZAMABAD

కమ్యూనిటీ మీడియేషన్ కేంద్రాలతో
సమస్యలు పరిష్కారం

- ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలి
- జిల్లా జడ్జి సునీత కుంచాల
- ఉమ్మడి జిల్లాలో తొలి కేంద్రం బోధన్‌లో ప్రారంభం

కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

బోధన్, ఆగస్టు 29 : రాజీ పడదగిన చిన్నపాటి గొడవలు, సమస్యల పరిష్కారానికి 'కమ్యూనిటీ మీడియేషన్ కేంద్రాలు' చక్కటి వేదికగా నిలవాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. గురువారం బోధన్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ భవనంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో మొట్టమొదటగా బోధన్‌లో ఏర్పాటుచేసిన ఈ కేంద్రాన్ని అన్ని శాఖలు, అధికారులు తగిన సహకారం, ప్రోత్సాహం అందించి విజయవంతం చేయాలని కోరారు.

అహంతో స్టేషన్లకు..

చిన్నచిన్న సమస్యలు సైతం అహం కారణంగా పోలీస్ స్టేషన్లకు వస్తాయని, కుటుంబ తగాదాలు, భూతగాదాలు, ఆస్తి పంపకాలు వంటి సమస్యలతో పలువురు పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలను ఆశ్రయిస్తారన్నారు. ఇలాంటి తగాదాల పరిష్కారం కోసమే తెలంగాణ రాష్ట్ర న్యాయసేవా సదన్, జిల్లా న్యాయసేవా సదన్ ఆధ్వర్యంలో బోధన్ మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఈ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. రాజీ పడదగిన, అనుకూలంగా ఉన్న సమస్యలను ఈ కేంద్రం ద్వారా అవసరమైతే ఒకటికి రెండుసార్లు కౌన్సిలింగ్ ఇచ్చి ఇరు పక్షాలను సామరస్య పరిష్కారానికి ఒప్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఓపికతో, సమయం తీసుకుని సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా కేసుల వల్ల జరిగే సమయం, డబ్బు వృథాపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కేంద్రం ద్వారా సమస్యలు పరిష్కరించి, పోలీస్‌శాఖకు, న్యాయస్థానాలకు పని తగ్గించాలని ఆమె కోరారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందనే విషయం వారికి వెల్లడించి, సానుకూలంగా పరిష్కరించాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, బోధన్ జిల్లా ఐదవ అదనపు న్యాయమూర్తి ఎస్. రవికుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత, సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్, అదనపు జూనియర్ సివిల్ ఈ. జడ్జి సాయిశివ, స్పెషల్ జడ్జి శేషతల్ప శాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోశెట్టి, జనరల్ సెక్రెటరీ కోటేశ్వర్‌రావు, కోశాధికారి శ్రీధర్‌బాబు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పల్నాటి సమ్మయ్య, ఏసీపీ శ్రీనివాస్, ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, కేంద్రం నిర్వాహకులు టి. పద్మాసింగ్, సుజాత, విశ్రాంత ఉపాధ్యాయులు రాజేందర్‌సింగ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

జలసవ్వడి

'మిషన్ కాకతీయ' తెచ్చిన సత్ఫలితాలు కళ్ల ముందు కనిపిస్తున్నాయి. చెరువులన్నీ నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే పెద్ద సంఖ్యలో తటాకాలు అలుగులు పోస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల హయాంలో ఆనవాళ్లు కోల్పోయిన చెరువులను మాజీ సీఎం కేసీఆర్ 'మిషన్ కాకతీయ' పథకం ద్వారా పునరుద్ధరించారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో అనేక తటాకాలు మళ్లీ వినియోగంలోకి వచ్చాయి. ఆయకట్టు కింది పొలాలకు ఆయువుపట్టుగా మారాయి. వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటలకు నీళ్లందిస్తున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో రైతులు ఆనందంగా పంటలు సాగు చేస్తున్నారు.

నిండుకుండలా రూరల్ మండలం ఆకులకొండూర్ గ్రామశివారులోని పల్ చెరువు

నిజామాబాద్ రూరల్ మండలంలోని ఆకుల కొండూర్ గ్రామశివారులో ఉన్న పల్ చెరువు, దాల్ చెరువు నిండుకుండల్లా మారాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక చొరవతో మిషన్ కాకతీయ పథకంలో భాగం గా రూ.85 లక్షలతో చెరువుల్లో పూడిక తీసి కట్ట ఎత్తు పెంచారు. కొత్తగా తూములు ఏర్పాటు చేసి పంట కాలువలకు సీసీ లైనింగ్ వంటి పనులు చేపట్టారు. ఫలితంగా రెండు చెరువుల్లో నీరు ఎక్కువగా నిల్వ ఉండే అవకాశం ఏర్పడింది. రూ.4.50కోట్లతో స్థానిక వాగుపై చెక్‌డ్యామ్ నిర్మించగా ప్రస్తుతం జలకళను సంతరించుకొని మత్తడి దూకుతున్నది.

నిండు కుండల్లా చెరువులు

మిషన్ కాకతీయతో పూర్వవైభవం
అలుగులు పోస్తున్న తటాకాలు
పెరిగిన భూగర్భ జలాలు
ఆనందంలో ఉమ్మడి జిల్లా రైతాంగం

అలుగు పారుతున్న మోర్తాడ్ ముసలమ్మ చెరువు

మోర్తాడ్/సారంగాపూర్, ఆగస్టు 29 : ఉమ్మడి జిల్లాలోని అనేక చెరువులు మత్తడి దూకుతున్నాయి. ఇటీవలి వర్షాలకు నిండుకుండల్లా మారిన తటాకాలు అలుగు పోస్తున్నాయి. ఆయకట్టు కింద రెండు పంటల సాగుకు అభయమిస్తున్నాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో చిన్నవి, పెద్దవి కలిపి 2500 చెరువులున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి లక్షలాది ఎకరాలకు నీరందుతున్నది. వర్షాకాలం ఆరంభంలో చెరువులున్నీ బోసిపోగా, ఇటీవలి వర్షాలకు నిండుగా మారాయి. మత్తళ్లు పోస్తున్న చెరువులను చూసి అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'కాకతీయ'తో పునరుద్ధరణ..

తెలంగాణలో కాకతీయులు తవ్వించిన గొలుసుకట్టు చెరువులే వ్యవసాయానికి ప్రధాన ఆధారం. అయితే, సమైక్య రాష్ట్రంలో తటాకాలు ఆనవాళ్లు కోల్పోయాయి. వందలాది చెరువులు కనుమరుగు కాగా, రైతులు బోర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెరువులుంటేనే భూగర్భ జలాలు పెరిగి, బోర్లలో నీళ్లు వచ్చే పరిస్థితి. కాలం కాకపోతే కరువు తాండవిస్తుండేది. ఇలాంటి తరుణంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అప్పటి సీఎం కేసీఆర్.. చెరువుల పునరుద్ధరణకు నడుం బిగించారు. పూడిక, చెట్లతో నిండిపోయిన తటాకాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు మిషన్ కాకతీయ పథకం తీసుకొచ్చారు. 2015 మార్చి 12న సదాశివనగర్‌లోనే కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని వేలాది చెరువుల్లో పూడిక తొలగించారు. ఫలితంగా పల్లెల్లో మళ్లీ జల పరవళ్లు ఆవిష్కృతమయ్యాయి. బీడువారిన పొలాల్లో పచ్చని పంటలు దర్శనమిస్తున్నాయి.

రెండు పంటలకు భరోసా..

ఇటీవలి వర్షాలతో చెరువులు కొత్త నీటితో కళకళలాడుతున్నాయి. నిజామాబాద్ జిల్లా సీఈ పరిధిలో బోధన్‌లో 182, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 324, ఆర్మూర్‌లో 198, బాల్కొండలో 292 చెరువులు కలిపి ఇరిగేషన్ శాఖ మొత్తం 996 చెరువులున్నాయి. అలాగే, కామారెడ్డి జిల్లా ఇరిగేషన్ శాఖ సీఈ పరిధిలో బాన్సువాడ డివిజన్ పరిధిలో 185, నిజాంసాగర్ డివిజన్ పరిధిలో 400, కామారెడ్డి డివిజన్‌లో 370, ఎల్లారెడ్డి డివిజన్‌లో 560 కలిపి మొత్తం 1515చెరువులున్నాయి. వీటిలో చాలావరకు జలకళ సంతరించుకున్నాయి.

అలుగు పోస్తున్న 'పెద్ద చెరువులు'

అతిపెద్దవిగా పేరొందిన చెరువులు సైతం మత్తడి దూకుతున్నాయి. కమ్మర్‌పల్లి మండలంలోనే అతిపెద్ద చెరువైన బషీరాబాద్ కాడి చెరువు అలుగు పారుతున్నది. మోర్తాడ్ మండలంలో అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన ముసలమ్మ చెరువు సైతం మత్తడి దూకుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, చెక్‌డ్యాములు జలకళను సంతరించుకోవడంతో ఆయకట్టు పంటలకు ఢోకా లేదని పేర్కొంటున్నారు.

మత్తడి దూకుతున్న కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ కాడిచెరువు

నాలుగైదు నెలల్లో
'స్థానిక' ఎన్నికలు

తొలుత పంచాయతీ, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎలక్షన్లు

సెప్టెంబర్ 6న డ్రాఫ్ట్ నోటిఫికేషన్.. 21న తుది ఓటర్ జాబితా

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

వీసీలో పాల్గొన్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు

కంఠేశ్వర్/ కామారెడ్డి, ఆగస్టు 29: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావివ్వరాదని పేర్కొన్నారు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయనున్నట్లు తెలిపారు. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ముందు పంచాయతీ, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, చివరగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు.

సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, 21న తుది ఓటరు జాబితాలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్, పోలింగ్ సిబ్బంది ఎంపిక, తుది ఓటరు జాబితా తయారీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియా శీలక పాత్ర పోషించాలని సూచించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 మంది ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల సంఖ్య650 దాటితే అదనపు పోలింగ్ కేంద్రంఏర్పాటు చేయాలన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో విధులను కేటాయించాలన్నారు. జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయాలతో పాటు మండల స్థాయిలోనూ ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు.

నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన వీసీలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, జడ్పీ సీఈవో ఉష, డీపీవో తరుణ్ కుమార్, ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్, కామారెడ్డిలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్,అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీపీవో శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

కాటేసిన డెంగ్యూ

- లింగంపేట వాసి మృతి

అన్నం రాజు (ఫైల్)

లింగంపేట, ఆగస్టు 29: విష జ్వరాలతో మృతి చెందుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల సదాశివనగర్ మండలంలోనే ముగ్గురు మృత్యువాత పడగా, తాజాగా లింగంపేట మండలంలో మరో వ్యక్తి డెంగ్యూతో కన్నుమూశాడు. మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన అన్నం రాజు (42)కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మూడ్రోజులుగా జ్వరంతో బాధ పడుతున్న రాజును కుటుంబ సభ్యులు కామారెడ్డిలోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అయితే, ప్లేట్‌లెట్స్ తగ్గిపోతుండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి నారాయణ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రాజు గురువారం కన్నుమూశాడు. డెంగ్యూతో బాధపడుతున్న రాజు ఊపిరితిత్తుల్లోకి నీరు చేరడం, గుండెపోటు రావడంతో మృతి చెందాడని వైద్యులు తెలిపారు.

భూంపల్లి కార్యదర్శి సస్పెన్షన్

రామారెడ్డి, ఆగస్టు 29: సదాశివనగర్ మండలం భూంపల్లి పంచాయతీ కార్యదర్శి నరేంద్రకుమార్‌పైనా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ వేటు వేశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించడంలో వైఫల్యంతో పాటు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం ఆదేశాలు జారీ చేశారు. భూంపల్లిలో పారిశుద్ధ్యం సరిగా లేక దోమలు విజృంభించి విషజ్వరాలు వ్యాప్తి చెందాయి. ఒకే గ్రామంలో ఇద్దరు చిన్నారులు విషజ్వరాలతో మృతి చెందడం ఉమ్మడి జిల్లాలో కలకలం రేపింది.

ఈ నేపథ్యంలోనే భూంపల్లిలోని పరిస్థితిపై 'విష జ్వరాల పంజా', 'పల్లెకు ఫీవర్' శీర్షికలతో 'నమస్తే తెలంగాణ' ఇటీవల కథనాలను ప్రముఖంగా ప్రచురించింది. దీంతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ప్రత్యేక అధికారితో పాటు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించిందని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని తేలడంతో పంచాయతీ కార్యదర్శి నరేంద్రకుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నరేంద్రకుమార్ స్థానంలో లింగంపల్లి కార్యదర్శి ప్రకాశ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో సంతోష్ తెలిపారు.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

తహసీల్దార్‌పై వేటు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 29:అవినీతికి పాల్పడుతున్న నాగిరెడ్డిపేట తహసీల్దార్ లక్ష్మణ్‌పై వేటు పడింది. ఆయనను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టరే ఆశిష్ సంగ్వాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్ కార్యాలయంలో జరుగుతున్న బాగోతంపై, స్థానికులు నిరసన తెలిపిన వైనం 'నమస్తే తెలంగాణ' ఈ నెల 24న ప్రచురించిన వార్త అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించింది. 'ప్రశ్నిస్తే బయటకు పొమ్మంటుండ్రు. పైసలిస్తేనే పనులు చేస్తుండ్రు' శీర్షికన వచ్చిన వార్తపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆర్డీవో ప్రభాకర్, ఇతర అధికారులు విచారణ జరిపి కలెక్టర్ సంగ్వాన్‌కు నివేదిక అందజేశారు. అధికారుల విచారణలో తహసీల్దార్ లక్ష్మణ్ అవినీతికి పాల్పడినట్లు తేలడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. లక్ష్మణ్ స్థానంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సరళాబాయిని నియమించారు.

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు

నిజాంసాగర్, ఆగస్టు 29 : నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగుచేస్తున్న పంటల కోసం గురువారం రెండో విడుదల నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రధాన కాలువ ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నదన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.875 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని తెలిపారు.

నేడు అలీసాగర్ నీటి విడుదల

నవీపేట, ఆగస్టు 29: అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా నేటి నుంచి నీటిని విడుదల చేయనున్నారు. మండలంలోని కోస్లీ గోదావరి మొదటి సంపు ద్వారా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శుక్రవారం అలీసాగర్ నీటిని విడుదల చేస్తారని ప్రాజెక్టు ఏఈ ప్రణయ్‌రెడ్డి తెలిపారు. లిఫ్టు పరిధిలోని ఆరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో 53.793 వేల ఎకరాలకు పైగా పంటలకు నీరందించనున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, ఆగస్టు 29: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 7,534 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 1085 అడుగులు (59.766టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. కాకతీయ, లక్ష్మి, సరస్వతీ కాలువలకు, మిషన్ భగీరథ కోసం 4,475 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

పశువులను ఎత్తుకెళ్లిన ఆగంతకులు

- మూడు గేదెలు, దూడ అపహరణ
- మరో ఘటనలో 18 మేకలు, పొట్టేలు చోరీ

చోరీకి వినియోగించిన కారు

వినాయక్‌నగర్/ కోటగిరి, ఆగస్టు 29: పశువుల దొంగలు పంజా విసిరారు. ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో గేదెలు, మేకలను అపహరించుకు పోయారు. సులువుగా సంపాదించాలనుకున్న ఓ గ్యాంగ్.. ఓ వాహనాన్ని అద్దెకు తీసుకుని మేకలను ఎత్తుకెళ్లగా, పోలీసులు వారి ఆట కట్టించారు. నిజామాబాద్ నగరంలోని కసాబ్‌గల్లీ ప్రాంతానికి చెందిన బిల్లికర్ దుర్గాజీకి మిర్చి కాంపౌండ్‌లో మేకల గోదాం ఉంది. రెండ్రోజుల క్రితం గోదాం నుంచి 18 మేకలు, పొట్టేలను అగంతకులు ఎత్తుకెళ్లారని దుర్గాజీ ఈ నెల 27న పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు సిబ్బందితో రంగంలోకి దిగారు. చోరీ జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా, అగంతకులు కారులో వచ్చి మేకలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వాహన నంబర్ ఆధారంగా కారు ఓనర్ మాలపల్లి వాసిగా గుర్తించి అతడ్ని విచారించారు. అయితే, తన వాహనాన్ని కొందరు అద్దెకు తీసుకున్నారని ఆయన చెప్పడంతో పోలీసులు కారును సీజ్ చేసి, ఠాణాకు తరలించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

గేదెల అపహరణ

కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో మూడె గేదెలు, ఒక దూడను దుండగులు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన అగ్గ గంగాధర్ రోజులాగే బుధవారం కూడా తన గేదెలను కట్టేసి ఉంచాడు. అయితే, అర్ధరాత్రి వేళ వాహనంలో వచ్చిన అగంతకులు మూడు గేదెలు, ఒక దూడతో పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

అక్రమ కేసులో ఐదున్నర నెలల నిర్బంధం అనంతరం జైలు నుంచి విడుదల అయిన ఎమ్మెల్సీ కవిత.. గురువారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఆమె వెంట మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఉన్నారు.